సాక్షి
కుమురం భీం

మంగళవారం ; 15 ; ఆగస్టు ; 2023



'గృహలక్ష్మి' దరఖాస్తుల పరిశీలన

గృహలక్ష్మి పథకానికి దరఖాస్తుల ప్రక్రియ పూర్తికావడంతో అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. IIIలో▸

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో గణితం బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఇంగ్లిష్ మీడియంలో బోధించేందుకు అర్హులు ఈ నెల 16న డెమోకు హాజరుకావాలని సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.18,200 వేతనం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.4 /25.3

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. రుతుపవనాలు, అల్పపీడనం ప్రభావంతో చాలాచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సీనియర్ సిటిజన్లకు ఆర్టీసీ రాయితీ

ఆసిఫాబాద్‌రూరల్/ఆసిఫాబాద్‌అర్బన్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం సీనియర్ సిటిజన్లకు ఆర్టీసీ ప్రత్యేక రాయితీ కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించే 60 ఏళ్లు దాటిన సీనియర్ సిటిజన్లకు టికెట్‌పై 50శాతం రాయితీ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పశుమిత్రలకు కనీస వేతనం చెల్లించాలి



వినతిపత్రం అందిస్తున్న పశుమిత్రలు

ఆసిఫాబాద్‌రూరల్: పశుమిత్రల సేవలను ప్రభుత్వం గుర్తించి, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు లోకేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో జిల్లా పశువైద్యాధికారి సురేశ్‌కు వినతిపత్రం అందించారు. పశుమిత్ర యూనియన్ నాయకులు శ్రీలత, వసుంధర, మారుబాయి, కవిత, మీనా, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

పార్కును సందర్శించిన అదనపు కలెక్టర్



వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని గాంధీ చౌక్ పార్కును సోమవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి మున్సిపల్ అధికారులతో కలిసి సందర్శించారు. పార్కులో కల్పించిన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజల కోసం మరిన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని ఎఫ్‌ఎస్‌టీపీలను పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మేనేజర్ పెద్దింటి క్రాంతి, డీఈఈ రమాదేవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బంగారు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఆసిఫాబాద్: కాగజ్‌నగర్ మండలంలోని పంచాయతీ కార్యదర్శుల ప్రగతి నివేదికలను సోమవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి పరిశీలించారు. నజ్రూల్‌నగర్ గ్రామ పంచాయతీలో రికార్డులు, హరితహారం, పల్లె ప్రకృతివనం ఇతర వివరాల గురించి ఆరా తీశారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంపీడీవో గౌరిశంకర్ తదితరులు ఉన్నారు.

'తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్'



మొక్క నాటుతున్న బీజేపీ నాయకులు

దహెగాం(సిర్పూర్): తెలంగాణలో రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలిచి డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పడుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండలంలోని మురళీగూడలో నా మట్టి– నా దేశం కార్యక్రమంలో భాగంగా సోమవారం మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోని నెట్టారని ఆరోపించారు. దహెగాం మండల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అందవెల్లి వద్ద పెద్దవాగుపై వంతెనకు మరమ్మతులు చేపట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మండల అధ్యక్షుడు ధనుంజయ్, కార్యదర్శి శ్రీకాంత్, ఉప సర్పంచ్ దామోదర్, నాయకులు పురుషోత్తం, సంజీవ్, సత్యనారాయణ, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవన పంటల సాగుపై శిక్షణ

వాంకిడి(ఆసిఫాబాద్): మండలంలోని సామేలా గ్రామంలోని రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి ఆధ్వర్యంలో సోమవారం శాస్త్రవేత్త స్రవంతి ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వానాకాలంలో వివిధ రకాల ఉద్యానవన పంటల సాగు విధానం, విత్తన దశలో తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ జిల్లా అధికారి నదీమ్, సర్పంచ్ మారుతి, ఏఈవో తాండవ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్లు వచ్చేశాయ్..!

- క్రీడాప్రాంగణాలకు త్వరలో పంపిణీ
- మండల కేంద్రాలకు చేరిన 878 కిట్లు
- గ్రామీణ క్రీడాకారులకు ఉపయోగకరం



దహెగాం మండల కేంద్రంలో స్పోర్ట్స్ కిట్లు

మండలాల వారీగా వివరాలు

మండలం	కిట్లు	మండలం	కిట్లు
ఆసిఫాబాద్	86	కౌటాల	40
బెజ్జూర్	49	లింగాపూర్	48
చింతలమానెపల్లి	30	పెంచికల్‌పేట్	24
దహెగాం	50	రెబ్బెన	59
జైనూర్	61	సిర్పూర్(టి)	38
కాగజ్‌నగర్	68	సిర్పూర్(యూ)	53
కెరమెరి	93	తిర్యాణి	104
		వాంకిడి	75

దహెగాం(సిర్పూర్): గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పల్లెల్లో తెలంగాణ క్రీడాప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా క్రీడాప్రాంగణాలకు త్వరలో కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేయనుంది. ఇప్పటికే ఈ కిట్లు ఆయా మండల కేంద్రాలకు చేరుకున్నాయి. గ్రామాల వారీగా పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

అందుబాటులోకి క్రీడాసామగ్రి..

మండల కేంద్రాలకు చేరుకున్న స్పోర్ట్స్ కిట్లను త్వరలోనే పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. క్రికెట్‌కు సంబంధించి 12 రకాల సామగ్రితోపాటు వాలీబాల్‌కు సంబంధించి నెట్, బాల్స్, ఫుట్‌పంప్, టేప్ తదితర వస్తువులు కిట్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే యువత శారీరక వ్యాయామం కోసం 30 కిలోల మూడు సెట్ల డంబెల్స్, 1, 2 కిలోల డిస్కస్ త్రో, 6 టెన్నికాయిట్ రింగ్స్, 4 స్కిప్పింగ్ రోప్, 3 విజిల్స్, స్టాప్‌వాచ్, క్రీడాకారులకు టీషర్టులు ఉన్నాయి.

వినియోగంలో 878 క్రీడాప్రాంగణాలు..

క్రీడలను ప్రోత్సహించేందుకు గ్రామాలతోపాటు మున్సిపాలిటీల్లోని ప్రధాన వార్డుల్లో క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. క్రీడాకారులకు అందుబాటులో ఎకరం విస్తీర్ణంతో కూడిన అనువైన స్థలం గుర్తించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. సౌకర్యాల కల్పనకు ఉపాధిహామీ పథకం కింద నిధులు మంజూరు చేసింది. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా 1,102 క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో 902 చోట్ల స్థలాలను గుర్తించారు. మిగిలిన 200 క్రీడాప్రాంగణాలకు స్థలాలు గుర్తించాల్సి ఉంది. మైదానాల్లో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, ఇతర వ్యాయామాలు చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 878 క్రీడాప్రాంగణాలు వినియోగంలో ఉన్నాయి. దీంతో ప్రభుత్వం జిల్లాకు 878 స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేసింది. పల్లెలకు క్రీడాపరికరాలు చేరితే ప్రతిరోజూ సాధన చేసేందుకు వీలవుతుందని క్రీడాకారులు పేర్కొంటున్నారు.



దహెగాంలోని తెలంగాణ క్రీడాప్రాంగణం

త్వరగా అందించాలి



ప్రతీ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేసింది. క్రీడా ప్రాంగణాల్లో వసతులు లేవని ఆటలకు దూరమవుతున్న సమయంలో క్రీడాసామగ్రి అందుబాటులోకి వచ్చింది. ఇక యువత రోజూ ప్రాక్టీస్ చేయొచ్చు. గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యం మెరుగుపడుతుంది. క్రీడాసామగ్రి త్వరగా అందించాలి.

– కె.రాజ్‌కుమార్, క్రీడాకారుడు, యాపల్‌గూడ మం.కౌటాల

ప్రతిరోజూ సాధన



క్రీడాప్రాంగణాల్లో ఆటవస్తువులు లేక సాధన చేయలేకపోతున్నాం. స్పోర్ట్స్ కిట్లు వచ్చిన నేపథ్యంలో ప్రతిరోజూ సాధన చేస్తూ, ఆటలు ఆడుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులు ఉన్నా వెలుగులోకి రావడం లేదు. క్రీడాకారులకు కిట్లు ఎంతగానో ఉపయోగపడతాయి. టీషర్టులు కూడా అందించడం ఆనందంగా ఉంది.

– పార్వెల్లి అంజీ, క్రీడాకారుడు, కల్వాడ, మం.దహెగాం

అధినేత మదిలో ఎవరో!

- సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో టికెట్లపై ఉత్కంఠ
- పలుచోట్ల మార్పులంటూ ప్రచారం
- బీఆర్‌ఎస్‌లో పెరుగుతున్న ఆశావహులు
- ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల మార్పు ఖాయం?



కేసీఆర్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గులాబీ అధినేత, సీఎం కేసీఆర్ మదిలో ఎవరెవరు ఉన్నారోనని సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో ఉత్కంఠ నెలకొంది. పార్టీ అభ్యర్థుల ఎంపిక కసరత్తు జరుగుతున్న నేపథ్యంలో పలు అంశాలు తెరపైకి వస్తుండడం చర్చనీయాంశంగా మారుతోంది. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలు సూచనప్రాయంగా తమకే టికెట్లు ఖరారైనట్లు చెప్పుకుంటున్నారు. కానీ ఇప్పటికీ అధికారికంగా జాబితా వెల్లడి కాలేదు. ఈ నెలలోనే మొదటి దఫా 70వరకు స్థానాల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థుల పేర్లు ప్రకటిస్తారని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాల్లోనూ అభ్యర్థుల పేర్లు ప్రకటిస్తే ఇప్పుడున్న ఎమ్మెల్యేలందరికీ టికెట్లు వస్తాయా..? లేక ఏయే స్థానాల్లో మార్పులు ఉంటాయా అనే తర్జన భర్జన నడుస్తోంది. మెజార్టీ స్థానాల్లో పాత వారికే మళ్లీ టికెట్లు ఇస్తామని అప్పట్లో సీఎం ప్రకటించారు. ఎక్కడైనా ఎమ్మెల్యేలు సర్వేలో గ్రాఫ్ పడిపోవడం, ప్రజల నుంచి వ్యతిరేకత, ప్రత్యర్థి కంటే వెనుకబడిపోవడం వంటి కారణాలను పరిగణనలోకి తీసుకుని మార్పులు చేస్తామని పేర్కొన్నారు. ఆయా స్థానాల్లో కొత్తవారికి అవకాశాలు ఉంటాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

మెజార్టీ స్థానాల్లో ఒకే..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గత ఎన్నికల్లో పది స్థానాల్లో ఆసిఫాబాద్ మినహా అన్ని చోట్ల బీఆర్‌ఎస్ జెండా ఎగురవేసింది. ఆ తర్వాత ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు సైతం పార్టీ మారడంతో ఉమ్మడి జిల్లాలో తిరుగులేని శక్తిగా ఎదిగింది. కొన్ని చోట్ల రెండో స్థానంలో నిలిచిన కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ బలపడడంతో అభ్యర్థుల ఎంపిక కీలకంగా మారింది. గెలుపు గుర్రాలకే టికెట్లు ఇచ్చి ఎలాగైనా మూడోసారి అధికారంలోకి రావాలని చూస్తున్న గులాబీ బాస్‌కు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వ్యతిరేకత ఉన్న వారి మార్పు ఖాయంగా వినిపిస్తోంది.

ఎక్కడెక్కడ మార్పు?

ఉమ్మడి జిల్లాలో ఆరు నుంచి ఏడు అసెంబ్లీ స్థానాల్లో దాదాపు పాత వారికే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఇందులో సిర్పూర్, ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, ముథోల్, చెన్నూరులో అభ్యర్థులకు ఢోకా లేనట్లు ప్రచారం జరుగుతోంది. మంచిర్యాల, బెల్లంపల్లి, ఖానాపూర్, బోథ్ స్థానాలపై ఊగిసలాట కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఈ స్థానాల్లో మార్పులు ఉంటాయా? కొత్త వారికి అవకాశాలు ఉంటాయా ? అనేది తేలాల్సి ఉంది.

ఆశావహుల ఆరాటం

ఎక్కడైనా సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చితే తమను పరిశీలనలోకి తీసుకోవాలని బీఆర్‌ఎస్‌లోనే అనేకమంది బీ ఫామ్ కోసం వరుసలో ఉన్నారు. అధిష్టానం దృష్టిలో పడేందుకు, ప్రజల్లో తమ బలం పెంచుకునేందుకు పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నిత్యం నియోజకవర్గాల్లో తిరుగుతున్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి తామే ఎమ్మెల్యే అభ్యర్థులం అన్నట్లుగా ప్రచారం చేసుకుంటున్నారు.

చివరి వరకు టెన్షన్ ?

మార్పులు చేసే చోట్ల ఎటూ తేల్చకుండా నాన్చుడు ధోరణి ఉంటే ఆ ఎమ్మెల్యేలకు చివరి క్షణం వరకు టెన్షన్ తప్పేలా లేదు. మొదటి జాబితాలో ఉన్న వారు ఉత్సాహంగా ప్రచారంలోకి దిగితే సీట్లు మార్చే చోట అందుకు భిన్నంగా ఉండనుంది. 'ఒక వేళ ఈలోపు రాష్ట్ర, జిల్లా సమీకరణలు మారితే అందరికీ టికెట్లు వచ్చినా ఆశ్చర్యం లేదు' అని సీనియర్ నాయకుడు ఒకరు అభిప్రాయం వ్యక్తం చేశారు. అభ్యర్థులను మార్చితే అందుకు తగిన వారుంటేనే పార్టీకి లాభం లేకపోతే ఇతరులు లబ్ధి పొందే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో అధినేత మనసులో ఏముందోనని జాబితా వెలువడే వరకు పార్టీ శ్రేణుల్లో చర్చ మాత్రం జోరుగా సాగుతోంది.

వేగంగా అర్జీల పరిష్కారం

- అదనపు కలెక్టర్ వేణు
- సమీకృత కలెక్టరేట్‌లో ప్రజావాణి



అర్జీ పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

ఆసిఫాబాద్: గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలు వేగంగా పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ వేణు అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో డీఆర్‌వో కదం సురేశ్‌తో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాయితీ రుణం మంజూరు చేయాలని లింగాపూర్ మండల కేంద్రానికి చెందిన ధవనే జైపాల్ అర్జీ సమర్పించాడు. కుటుంబ పోషణ కష్టంగా మారిందని, ఆశ్రమ పాఠశాలలో దినసరి కూలీగా అవకాశం కల్పించాలని కెరమెరి మండలం కరంజీవాడకు చెందిన కుమురం లక్ష్మణ్ కోరాడు. భర్త ఆరేళ్ల క్రితం మృతి చెందాడని, ఇద్దరు పిల్లల పోషణ కోసం ఇంటర్ చదివిన తనకు ఆరోగ్య కార్యకర్తగా ఉపాధి కల్పించాలని కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన బోగ శారద దరఖాస్తు చేసుకుంది. అనారోగ్య కారణాలతో సదరం శిబిరానికి హాజరు కాలేకపోయానని, తర్వాత నిర్వహించే శిబిరంలో అవకాశం కల్పించాలని కాగజ్‌నగర్ మండలం భట్టుపల్లికి చెందిన బూస బాపు అర్జీ పెట్టుకున్నాడు. కరోనా సమయంలో తన భర్త మృతి చెందాడని, కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం ఇప్పించాలని ఆసిఫాబాద్ మండలం కొటగూడకు చెందిన గేడం పద్మ విన్నవించింది. వీఆర్‌ఏగా పనిచేస్తూ తన తండ్రి మృతి చెందాడని, వారసత్వంగా రావాల్సిన ఉద్యోగాన్ని ఇప్పించాలని సిర్పూర్(టి) మండలానికి చెందిన మహమ్మద్ ఫరాహత్ హుస్సేన్ దరఖాస్తు చేసుకున్నాడు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందించిన సెకండ్ ఏఎన్‌ఎంలు



అదనపు కలెక్టర్‌కు సమ్మె నోటీసు అందిస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

ఆసిఫాబాద్‌రూరల్: డిమాండ్ల నెరవేర్చాలని ఈ నెల 16 సమ్మె చేపట్టనున్నట్లు నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు సోమవారం జిల్లా కేంద్రంలో అదనపు కలెక్టర్ వేణుకు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ సెకండ్ ఏఎన్‌ఎంలను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఈ నెల 16 నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు తెలిపారు. సమ్మె విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు సంతోషి, జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్, కార్యదర్శి మధుకర్, నాయకులు సునీత, పరమేశ్వరి, పుష్ప, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తిరిగి మాత్రలు అందించాలి

కెరమెరి(ఆసిఫాబాద్): వైద్యసిబ్బంది ఇంటింటికీ తిరిగి వయస్సు ఆధారంగా బోదకాలు నివారణ మాత్రలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్ అన్నారు. మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్‌లో భాగంగా సోమవారం మండలంలోని సుర్దాపూర్ హెల్త్ వెల్‌నెస్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎంఎల్‌హెచ్‌పీ త్రివేణిని అడిగి మాత్రల పంపిణీ వివరాలను తెలుసుకున్నారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమం ఈ నెల 25 వరకు కొనసాగుతుందన్నారు. వైద్యసిబ్బంది నిత్యం గ్రామాలను సందర్శించి వ్యాధుల నివారణకు కృషి చేయాలన్నారు. విషజ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి వినోద్‌కుమార్, హెచ్‌ఈవో శ్యాంలాల్, ఫార్మసిస్ట్ ఖలీల్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ పత్రాలు అందజేత

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి సురేశ్, ఎంపీపీ మల్లికార్జున్ రెండో విడత గొర్రెల పంపిణీకి సంబంధించిన పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఆసిఫాబాద్ మండలంలోని గుడెం ఘాట్ గ్రామంలో ఆరుగురు, బూర్గుడలో ఆరుగురు లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ పత్రాల అందించారు. జిల్లా పశువైద్యాధికారి మాట్లాడుతూ జిల్లాలో 530 మంది డీడీలు కట్టగా, ఇప్పటివరకు 84 మందికి మహారాష్ట్రలోని చంద్రపూర్, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాలో గొర్రెలు కొనుగోలు చేసి అందించామని తెలిపారు. మిగిలిన వారికి త్వరలోనే పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆ శాఖ అధికారులు మురళికృష్ణ, తదితరులు ఉన్నారు.

తగ్గిన ఆసక్తి

- మద్యం దుకాణాలకు అంతంతే దరఖాస్తులు
- చంద్రపూర్ జిల్లాలో మద్యపాన నిషేధం ఎత్తివేయడంతోనే..
- చివరి రోజుల్లో పెరుగుతాయని ఎక్సైజ్ అధికారుల అంచనా



సోమవారం జిల్లా కేంద్రంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

చింతలమానెపల్లి(సిర్పూర్): జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాల టెండర్లపై వ్యాపారుల్లో ఆసక్తి తగ్గినట్లు కనిపిస్తోంది. ప్రభుత్వం మద్యం దుకాణాలకు ముందస్తుగానే టెండర్లు ప్రకటించినా వ్యాపారులు ప్రణాళిక ప్రకారమే దరఖాస్తులు సమర్పిస్తున్నారు. దీంతో ఈసారి ఎక్సైజ్ శాఖ అధికారులు అంచనాల మేరకు టెండర్లు వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 4 నుంచి జిల్లాలో 32 మద్యం దుకాణాలకు టెండర్లు ఆహ్వానించింది. ఆసిఫాబాద్ డివిజన్‌లో 16, కాగజ్‌నగర్ డివిజన్‌లో 16 దుకాణాల నిర్వహించనున్నారు. ఈ నెల 4 నుంచి దరఖాస్తులు ఆహ్వానించగా 18వ తేదీ నాటికి గడువు ముగియనుంది. 25న లక్కీడ్రా ద్వారా వ్యాపారులను ఎంపిక చేయనున్నారు.

మహారాష్ట్రలో మద్యనిషేధం ఎత్తివేసినందుకే..

జిల్లాలోని సరిహద్దు మండలాలైన వాంకిడి, సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, దహెగాం మండలాల్లోని మద్యం దుకాణాలకు ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. ఈ మండలాలు తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో ఉంటాయి. వీటిని ఆనుకుని చంద్రపూర్, గడ్చిరోలి జిల్లాలు ఉన్నాయి. ఆయా జిల్లాల్లో గతంలో మద్యపాన నిషేధం అమలులో ఉండేది. దీంతో సిర్పూర్(టి), వాంకిడి, కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, దహెగాం మండలాల్లోని మద్యం దుకాణా లకు మహారాష్ట్ర నుంచి మద్యంప్రియులు అధికంగా వచ్చేవారు. చంద్రపూర్ జిల్లాలో నిషేధం ఎత్తివే యడంతో అక్కడ ప్రస్తుతం దేశీదారు అమ్మకాలు సాగుతున్నాయి. దీంతో జిల్లాలో మద్యం అమ్మకాలు పడిపోయాయి. రెండేళ్ల క్రితం ఉన్న అమ్మకాలు ప్రస్తుతం లేకపోవడంతో వ్యాపారులకు ఆశించిన లాభాలు రావడం లేదు. దుకాణాల నిర్వహణకు వ్యాపారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు.

284కు చేరిన దరఖాస్తులు

ఆసిఫాబాద్: మద్యం దుకాణాల దరఖాస్తుల గడువు సమీపిస్తుండటంతో వ్యాపారులు అప్రమత్తమయ్యారు. సోమవారం 163 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కరోజే ఆసిఫాబాద్ డివిజన్‌లో 83, కాగజ్‌నగర్ డివిజన్‌లో 80 దరఖాస్తులు రావడంతో మొత్తం దరఖాస్తుల సంఖ్య 284కు చేరినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్ తెలిపారు.

అదనంగా మరికొన్ని..

చింతలమానెపల్లి మండలంలో గతంలో రవీంద్రనగర్‌లో మాత్రమే మద్యం దుకాణం ఉండేది. రెండు సంవత్సరాల క్రితం ప్రభుత్వం సరిహద్దులోని గూడెం వద్ద మరో వైన్స్ అదనంగా మంజూరు చేసింది. పోటీ పెరిగి రవీంద్రనగర్‌లో అమ్మకాలు పడిపోయాయి. గూడెం గ్రామానికి సరిహద్దుకు మరోవైపు అహేరి, ఆళ్లపల్లి, ఏటపల్లి వంటి పట్టణాలు ఉన్నాయి. అక్కడ మద్యనిషేధం కారణంగా గూడెంలోని వైన్స్‌లో అమ్మకాలు పట్టణాలతో సమానంగా ఉంటాయి. ఈ మద్యం దుకాణానికి ఈ సారి కూడా టెండర్లు అధికంగా వస్తాయని ఎక్సైజ్‌శాఖ అధికారులు నమ్మకంతో ఉన్నారు.

గ్రూపులుగా టెండర్లు..

ప్రభుత్వం 2023– 25 సంవత్సరాలకు మద్యం పాలసీని ప్రకటించింది. రానున్న అసెంబ్లీ, పార్లమెంట్, పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మద్యం అమ్మకాలు జోరుగా ఉంటాయనే నమ్మకం వ్యాపారుల్లో ఉంది. జిల్లాలో పట్టణ ప్రాంతాలైన ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లో వైన్స్‌లపై వ్యాపారుల్లో ఆసక్తి ఎక్కువగా ఉంది. ఆయా దుకాణాలకు దరఖాస్తులు వేసేందుకు వ్యాపారులు గ్రూపులుగా ఏర్పడుతున్నారు. ఈ నేపథ్యంలో చివరి రోజుల్లోనే దరఖాస్తులు అధికంగా వచ్చే అవకాశం కనిపిస్తోంది.

స్వాతంత్ర్య వేడుకలకు ముస్తాబు

- కలెక్టరేట్ వద్ద నేడు జెండావిష్కరణ
- ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ సుంకరి రాజు
- ఏర్పాట్లు పర్యవేక్షించిన అదనపు కలెక్టర్ వేణు



సమీకృత కలెక్టరేట్ వద్ద ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్: స్వాతంత్ర్య వేడుకలకు జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ ఆవరణ ముస్తాబైంది. గతేడాది స్వాతంత్ర్య వేడుకలు మొక్కుబడిగా జరిగిన నేపథ్యంలో ఈసారి సంబురాలు ఆర్భాటంగా నిర్వహించేందుకు కలెక్టర్ హేమంత్ బోర్కడే ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లా అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు సమీకృత కలెక్టరేట్ పరిసరాలను శోభాయమానంగా తీర్చిదిద్దారు. వేడుకల్లో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖల అభివృద్ధి కార్యక్రమాలపై శకటాలు ప్రదర్శించడంతోపాటు స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు.

11 గంటలకు జెండావిష్కరణ

రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్య అతిథిగా శాసన మండలి సభ్యులు సుంకరి రాజు హాజరు కానున్నారు. సోమవారం సాయంత్రం అదనపు కలెక్టర్ వేణు, డీఆర్వో కదం సురేశ్‌తోపాటు రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు పరిశీలించారు. సమీకృత కలెక్టరేట్ ఆవరణలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్సీ జాతీయ పతాకావిష్కరణ చేయనున్నారు. 11.05 గంటలకు పోలీసు గౌరవ వందన స్వీకరణ, 11.10 గంటలకు జిల్లా ప్రగతిపై ప్రసంగం, 11.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, మధ్యాహ్నం 12 గంటలకు విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు ప్రదానం చేయనున్నారు. ప్రజలు ఇళ్లపై జాతీయ పతాకం ఏర్పాటు చేసుకుని జాతీయ భావాన్ని చాటి చెప్పాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే కోరారు.

క్లుప్తంగా

సెప్టెంబర్ వేతనంతో ఏరియర్స్ చెల్లించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాసిపేట(బెల్లంపల్లి): 11వ వేజ్‌బోర్డు, 23 నెలల ఏరియర్స్ సెప్టెంబర్ నెల వేతనంతో చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మందమర్రి ఏరియా కాసిపేట, కాసిపేట-2 గనులపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపి ఆయా గనుల మేనేజర్లకు వినతిపత్రం అందజేశారు. కోలిండియాలో ఆగస్టు నెలతో ఇవ్వనుండగా సింగరేణిలో సర్క్యులర్ జారీ చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటన్నారు. బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, కాసిపేట పిట్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు రాజేందర్, లింగయ్య, శ్రీనివాస్, రఘురాం, కాసిపేట-2 పిట్ కార్యదర్శి శ్రీనివాస్, శ్రీధర్, రత్నం, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్కే 7 గనిపై ధర్నా

నస్పూర్: 11వ వేజ్‌బోర్డుకు సంబంధించిన ఏరియర్స్ చెల్లించాలని ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య డిమాండ్ చేశారు. సోమవారం కార్మికులతో కలిసి ఆర్కే 7 గనిపై ధర్నా నిర్వహించారు. అనంతరం గని ఎస్వో రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గని పిట్ సెక్రెటరీ ప్రతాప్, మైనింగ్ స్టాఫ్ కార్యదర్శి రాజేందర్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ముదిరిన నారుతో జాగ్రత్త

- నాట్లు ఆలస్యమైతే పంట దిగుబడిపై ప్రభావం
- వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి
- జాడి బాపు, ఏడీఏ, చెన్నూర్



వరి నారు తీస్తున్న మహిళలు

జాడి బాపు

చెన్నూర్‌రూరల్: ఈ ఏడాది వానాకాలం సీజన్ ప్రారంభంలో కురిసిన వర్షాలకు జిల్లాలోని రైతులు వరి నారుమడులు సిద్ధం చేశారు. కానీ పదిహేను రోజులుగా వర్షాలు ముఖం చాటేయడంతో నాట్లు ఆలస్యం కానున్నాయి. దీంతో రైతులు వర్షాలకోసం ఎదురుచూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 1.60 లక్షల ఎకరాల్లో వరిపంట సాగవుతుందని అధికారులు అంచనా వేయగా ఇప్పటి వరకు 1.27 లక్షల ఎకరాల్లో మాత్రమే నాట్లు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు నాట్లు వేయని రైతులు నారు ముదిరిపోతోందని ఆందోళన చెందుతున్నారు. ముదిరిన నారుతో నాట్లు వేయడం ఎలా? తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చెన్నూర్ ఏడీఏ జాడి బాపు వివరించారు.

ముదిరిన నారు ఎలా నాటుకోవాలి?

ముదిరిన వరినారుతో నాటువేస్తే పంట దిగుబడి తగ్గుతుంది. నాటు పైపైన నాటితే పిలకలు వచ్చే అవకాశం ఉంటుంది. నాటు వేసిన తర్వాత ప్రతీ రెండు మీటర్లకు ఒకటి చొప్పున కాలి బాటలు తీయాలి. ముదురు నారు నాటినప్పుడు కుదుళ్ల సంఖ్య పెంచి కుదురుకు 4 నుంచి 5 మొక్కల చొప్పున నాటాలి. కుదుళ్లను దగ్గరగా నాటుకోవాలి. సిఫార్సు కంటే 25 శాతం పెంచి రెండు దఫాలుగా 70 శాతం దమ్ములో 30 శాతం అంకురం దశలో వేయాలి. 2 బస్తాల యూరియా, ఒక బస్తా డీఏపీ, ఒక బస్తా పొటాష్‌ను మూడు భాగాలుగా చేసి నాటుకు ముందు దమ్ము దశలో, అంకురం దశలో బురద పదునులో మాత్రమే సమానంగా చల్లాలి. రెండు రోజుల తర్వాత పలుచగా నీరు పెట్టాలి. డీఏపీ ఎరువును దమ్ములోనే వేయాలి. పొటాష్ ఎరువును అఖరి దమ్ములో సగం, అంకురం ఏర్పడే దశలో మిగతా సగం వేయాలి. జింకులోపం నివారణకు లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ చొప్పున కలిపి ఐదు రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడుసార్లు పిచికారీ చేయాలి.

పురుగుల నివారణ

వరిలో కాండం తొలిచే పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీలీటర్ల ద్రావణం లేదా సోనామిడాన్ 2 మిల్లీలీటర్లను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. చిరుపొట్టదశలో కార్బోఫ్యూరాన్ 3 కిలోల గుళికలను ఎకరాకు 10 కిలోల చొప్పున చల్లాలి.

దోమల నివారణ

వరిలో దోమల నివారణకు కాలిబాటలు వదలాలి. క్లోరిఫైరిపాస్ 2 మిల్లీలీటర్లు లేదా ఇమిడాక్లోప్రిడ్ రెండు మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తాటాకు తెగులు నివారణకు రెండు మిల్లీలీటర్ల ప్రొఫెనోఫాస్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఇలాంటి పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధిస్తారు.

చెరువులోపడి ఒకరు మృతి

కాసిపేట(బెల్లంపల్లి): ప్రమాదవశాత్తు చెరువులోపడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కోనూరు తంగళ్లపల్లికి చెందిన కొడిమల పోశం (32) తాపీమేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిస కావడంతో మూడేళ్లక్రితం అతని భార్య లావణ్య పుట్టింటికి వెళ్లిపోయింది. సోమవారం ఉదయం ఇంటినుంచి బయటకు వెళ్లి సాయంత్రమైనా తిరిగిరాకపోవడంతో అతని తల్లి బుచ్చక్క, సోదరుడు వెతికేందుకు వెళ్లగా వారిని గమనించిన పోశం చెరువుకట్టపై చెట్లపొదల్లో దాక్కున్నాడు. అతని వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. దీంతో వారు కేకలు వేయడంతో గ్రామస్తులు వచ్చి బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

యథేచ్ఛగా ప్రభుత్వ భూమి కబ్జా

నస్పూర్: పట్టణ శివారులోని 64సర్వేనంబరులో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సుమారు 19గుంటల భూమి కబ్జా చేసి చుట్టూ తాత్కాలిక ప్రహరీ నిర్మించారు. సీసీసీ నస్పూర్ పోలీసుస్టేషన్, పీహెచ్‌సీకి మధ్య ఉన్న ఈ భూమి రూ.కోట్ల ధర పలుకుతోంది. అధికారులు అందుబాటులో ఉండరని ప్రభుత్వ సెలవు రోజుల్లోనే కబ్జా చేస్తున్నారు. ఈ కబ్జా వ్యవహారంలో సింగపూర్ గ్రామ పంచాయతీలో కీలక పదవి అనుభవించిన ఓ మాజీ ప్రజాప్రతినిధి హస్తం ఉన్నట్లు బహిరంగంగానే ఆరోపణలు వస్తున్నాయి. పలువురు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ పఠాన్‌ను సంప్రదించగా.. ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనట్లు తమ దృష్టికి వచ్చిందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రజావాణిలో ఫిర్యాదు..

64 సర్వే నంబరులోని భూమిలో గతంలో ఆటోనగర్‌కు కేటాయించారని తాళ్లపల్లి సర్పంచ్ జక్కుల రాజేశం, ఆయుర్వేదిక్ ఆసుపత్రి భవన నిర్మాణానికి 4 గుంటలు కేటాయించారని, దానిని కొందరు ఆక్రమించారని ఆయుర్వేదిక్ ఆసుపత్రి సిబ్బంది సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు ఫిర్యాదు చేశారు.

లైంగిక వేధింపులపై విచారణ

- ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తా
- మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి



మాట్లాడుతున్న ఈశ్వరీబాయి

బెజ్జూర్(సిర్పూర్): మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులపై ప్రధానోపాధ్యాయుడు పార్థిరాం లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనపై విచారణ జరుగుతున్నట్లు రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి తెలిపారు. సోమవారం ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో పాటు హాస్టల్ సిబ్బందిని విచారణ చేస్తున్నట్లు తెలిపారు. బాలికల పాఠశాలలో పురుష ఉపాధ్యాయులు ఉండకూడదని విద్యార్థుల తల్లిదండ్రులు, గిరిజన నాయకులు, ప్రజాప్రతినిధులు ఆమె దృష్టికి తీసుకురాగా విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తానన్నారు. ఆమె వెంట డీసీఎంఎస్ వైస్ చైర్మన్, ఐటీడీఏ డైరెక్టర్ మాంతయ్య, కాగజ్‌నగర్ ఏటీడీవో ఖమర్ హుస్సేన్, జెడ్పీటీసీ పుష్పలత, తదితరులు ఉన్నారు.

హెచ్‌ఎంపై పోక్సో కేసు

గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పార్థిరాంపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు బెజ్జూర్ ఎస్సై విక్రమ్ తెలిపారు. లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

చదువు ఇష్టంలేక విద్యార్థిని ఆత్మహత్య

దండేపల్లి(మంచిర్యాల): చదువుకోవడం ఇష్టంలేక విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కుందారపు ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నెల్కివెంకటాపూర్‌కు చెందిన బూసారపు శ్రీనివాస్ కుమార్తె శ్రావ్య (17) లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. ఆమెకు చదువుపట్ల శ్రద్ధ లేకపోవడంతో కొద్దిరోజులుగా కళాశాలకు సరిగా వెళ్లడంలేదు. తల్లిదండ్రులు నచ్చజెప్పి పంపించినా మళ్లీ మూడురోజులుగా ఇంటివద్దే ఉంటోంది. తండ్రి శ్రీనివాస్ మందలించడంతో మనస్తాపం చెంది ఆదివారం రాత్రి పురుగుల మందు తాగింది. గమనించిన తల్లి దండ్రులు ముందుగా లక్సెట్టిపేట ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పోక్సో కేసులో ఒకరికి జీవిత ఖైదు

చింతలమానెపల్లి: బాబాసాగర్ గ్రామానికి కొండు కొండు రాజేశ్‌కు పోక్సో కేసులో జీవిత ఖైదుతో పాటు రూ.80 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి ఎం.వి.రమేష్ సోమవారం తీర్పునిచ్చినట్లు కౌటాల సీఐ సాదిక్ పాషా, ఎస్సై వెంకటేశ్ తెలిపారు. బాబాసాగర్‌కు చెందిన రాజేశ్ అదే గ్రామానికి చెందిన గిరిజన బాలిక(17)పై 2016లో లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కౌటాల ఎస్సై వెంకటేశ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువుకావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

ట్రాక్టర్ కిందపడి హమాలీ మృతి



దేవానాయక్ మృతదేహం

చెన్నూర్: పట్టణంలోని బైపాస్ రోడ్డులో ట్రాక్టర్ కింద పడి హమాలీ కార్మికుడు మృతి చెందినట్లు సీఐ వాసుదేవ రావు తెలిపారు. లంబాడిపల్లి గ్రామానికి చెందిన నాగవత్ దేవానాయక్ (55) చెన్నూర్‌లోని మారుతి హార్డ్‌వేర్ షాపులో హమాలీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సోమవారం దుకాణంలో నుంచి ట్రాక్టర్‌లో సిమెంట్ సంచులు వేసుకుని బైపాస్ రోడ్డులో గల సాయిరాం ఫంక్షన్ హాల్ వైపు వెళ్తుండగా డ్రైవర్ మద్ది మల్లయ్య అజాగ్రత్తగా నడపడంతో ట్రాక్టర్‌పై కూర్చున్న దేవానాయక్ ట్రాలీ వెనుక టైర్ కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించారు. మృతుని కుమారుడు రాజ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రైవర్ మద్ది మల్లయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

గోల్కొండకోటకు గుస్సాడీ బృందం



హైదరాబాద్‌కు బయలుదేరిన కనక రాజు బృందం

నార్నూర్(జైనూర్): హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు జైనూర్ మండలంలోని మార్లవాయి గ్రామానికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు గుస్సాడీ బృందం కళాకారులు సోమవారం హైదరాబాద్ బయలు దేరారు. ఈ సందర్భంగా బృందం ఇన్‌చార్జి కనక సుదర్శన్ మాట్లాడుతూ వేడుకల్లో పాల్గొని ఆదివాసీ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ప్రదర్శన రూపంలో తెలియజేస్తామన్నారు.



















